# పయనమయే ప్రియతమా-2

- నిషిగంధ

లేత తామరాకు పొట్లంలోనుంచి తొంగి చూస్తున్న కనకాంబరాల మాలలా ఉంది ఆకుపచ్చని చుడీదార్లో తను..

మెట్ల మీద ఉన్నప్పుడే నన్ను చూసినట్టుంది నడక వేగం పెంచడం తెలుస్తూనే ఉంది.. అదొక్కటే కాదు, చిన్నప్పుడు చిరుచీకట్లలో వెలిగించిన భోగిమంట వెలుగు గుర్తొచ్చింది క్రమంగా ఆ వదనమంతా విస్తరిస్తున్న సంతోషాన్ని చూస్తుంటే!

నాకైతే ఇంకా అయోమయంగానే ఉంది!!

"ఇంతేనా లగేజీ?" తన చేతిలోని బ్యాగ్ ని అందుకుంటూ అడిగాను..

"రెండురోజులకే.. అసలు ఈ టైంలో సెలవు ఇవ్వడమే గొప్ప కదా!" తన కైనెటిక్ స్టాండ్లోంచి తీసుకొచ్చి స్టార్ట్ చేసి నావంక చూసింది..

బుద్ధిగా బాగ్ పట్టుకుని వెనక కూర్చున్నాను..

"లేడీస్ హాస్టెల్ అని అస్సలు మొహమాటపడొద్దు.. వాచ్ మాన్ కి చెప్పేను నువ్వొచ్చి బండి పెట్టేస్తావని" బిల్డింగ్ బయటకి రాగానే గేటు దగ్గర ఉన్న వ్యక్తికి నన్ను చూపిస్తూ ఏదో సైగ చేసింది.. అది తర్జుమా చేయటం తెలిసిన నిపుణుడిలా అతను తల పంకించాడు..

"Hematopoietic stem cell transplants మన దేశంలో కనీసం మధ్యతరగతి ప్రజలకి అందుబాట్లో ఉండే రోజులొస్తాయంటావా?" బండి వేగం పెంచుతూ అడిగింది.

Don't tell me! పొద్దున్నే రమ్మని పిలిచింది రక్త సంబంధిత రోగాల నివారణ, తరుణోపాయాలు.. వీటి గురించి మాట్లాడటానికి కాదు కదా! అదేదో వర్క్ కి వచ్చినప్పుడు ల్యాబ్ లోనే డిస్కస్ చేయొచ్చుగా?!

ఇంకా తెలీటం లేదు?! బస్సులున్నాయి.. ఆటోలున్నాయి.. అవీ కాదంటే తనతో పాటే హాస్టెల్ లో ఉండే మా గ్యాంగ్ లోని అమ్మాయిలున్నారు.. మరి నేనే ఎందుకు?!?! సినిమాలు, రెస్టారెంట్లూ, సహాయ కార్యక్రమాలు ఇప్పటివరకూ అన్నీ మా గ్యాంగ్ అంతా కలిసే చేశాం.. ఇప్పుడిలా ఇద్దరమే!

టూ వీలర్ మీద వెళ్తున్నట్టు లేదు.. టు సీటర్ క్యారేజీ ఉన్న జెయింట్ వీల్ ఎక్కినట్లుంది, ఉల్లాసమూ.. ఉద్వేగమూ పోటీ పడుతున్నాయ్!

"ఏంటీ? మీటింగ్ కి లేట్ అవుతుందేమోనని ఆలోచిస్తున్నావా?"

"ఛ అదేం కాదు". ఓ.. ఇవాళ డ్రగ్ డిజైన్ వాళ్ళతో లైసెన్స్ ఇష్యూస్ గురించి మీటింగ్ ఉంది కదూ!! ఏంటో ఉన్నట్టుండి ఈ క్షణాన ఐహిక విషయాలన్నీ అనవసరం అనిపిస్తున్నాయి..

"నాకు తెల్సు నీకేదో కంఫ్యూజింగ్ గా ఉందని.. అసలు నిన్ను రమ్మంది..."

అనుకున్నాను.. విషయం తెలిసిపోయింది!! తనంటే ఇష్టమనీ.. అదీ చెప్పాలంటే భయపడేంత ఇష్టమనీ.. తెలిసిపోయి ఉంటుంది!

అయినా ఎలా సాధ్యం?! నేనెవరికీ చెప్పలేదు కదా?! ఎంత కలిసి తిరిగినా, ఒకే చోట పనిచేసినా నేను తనని ప్రేమించానంటే నా స్నేహితులన్న వాళ్ళే పగలబడి నవ్వరూ?! మరి పోలియో ఎటాక్ అయిన వాళ్ళు ప్రేమించడం లాంటి పనులు చేయకూడదు కదా! అందుకేగా తన మీద ఇష్టాన్ని ఎవరికీ కనబడకుండా గుండె అనబడే బూరుగుదూది గదిలో కప్పెట్టేసి కుట్టేశాను.. కొంపదీసి కంటిచూపుల సందుల్లోంచి ఎప్పుడైనా బయటపడ లేదుకదా! అంతే అయి ఉంటుంది.. ఇప్పుడు నాకు ఒక క్లాస్ తీసుకుంటుందేమో? కాస్త సెన్స్ ఉన్న అమ్మాయి కాబట్టి అందర్లో ఉన్నప్పుడు కాకుండా అనుమానం రాని ఏకాంతాన్ని సృష్టించింది!

"...నీకున్న అలాంటి అర్హతలే నన్నీ నిర్ణయం తీసుకునేలా చేశాయి"

ఏం అర్హతలు? ఏం నిర్ణయం?? ఏదో మిస్సెయ్యాను..అసలీ టైంలో ఊహల్లోకి జారడం నాకంత అవసరమా!!

"ఎదురుగా కూర్చునో, పక్కన నడుస్తూనో నీకీ విషయం మొదటిసారి చెప్పే ధైర్యం నాకు లేదు.. ఇప్పుడైతే నీ ఎక్స్ప్రెషన్స్ నాకస్సలు తెలీవుగా! అందుకే ఈ ఏర్పాటు".

పక్కన రయ్యుమని దూసుకు వెళ్తున్న వాహనాల రొదలో కూడా నా గుండె చప్పుడు నాకు స్పష్టంగా వినిపిస్తోంది..

"నువ్వంటే నాకిష్టం రిషీ"

గుండె గొంతులో కొట్టుకుంటుందేమిటో?!

"నిన్ను భాగస్వామిగా చేసుకోవాలన్నంత ఇష్టం"

ఏ తపస్సూ చేయకుండానే వరమిస్తానంటుందేమిటీ దేవత?!

అలజడి అలలు నెమ్మదించి ఆనందం ఆకాశంలా విస్తరించడం తెలుస్తూనే ఉంది!

టికెట్స్ తీసుకుని ప్లాట్ఫాం మీదకి రాగానే ఖాళీగా ఉన్న బెంచీ వైపు చూపించింది.. తను నా చూపులను బంధించడం కోసం ప్రయత్నించడం కనుకొసల నుంచి అర్థమౌతోంది.. తన ఆరాటం ఎందుకో సరదాగా ఉంది.. అందుకే తనకి చిక్కకుండా కళ్ళని ప్లాట్ఫాం అంతా పరిగెత్తిస్తున్నాను!

"నా ఛాయలేవీ లేకుండా నీకు ఆలోచించుకోవడానికి వీలుగా ఉంటుందని ఇలా ఊరెళ్తూ చెప్తున్నాను.."

నీ ఛాయ లేకుండానా? నువ్వు మరీను! అలని తాకననే తీరముంటుందా??

"మొన్న సెమినార్లో నేను ప్రెజెంట్ చేసిన human genetic manipulation paper నీకు నచ్చిందన్నావుగా.. ఇద్దరం కలిసే రీసెర్చ్ మొదలుపెడదాం.. మన నించి ముందు తరాలకి లోపాలు లేని జీన్స్ వారసత్వంగా ఇవ్వడానికి మన శక్తిమేర ప్రయత్నం చేద్దాం రిషీ.. ఎంచక్కా ఒక రిమోట్ ప్లేస్ లో, చుట్టూ పచ్చదనం మాత్రమే తోడుండే స్థలంలో ల్యాబ్ కట్టుకుందాం.. లోపల జన్యు కణాలు, బయట ప్రకృతి.. కాసిని పుస్తకాలు, బోల్డన్ని పాటలు.. ఇవే మన ప్రపంచంగా చేసుకుందాం.. అఫ్కోర్స్ ఇదంతా నీ సమాధానం 'యెస్ ' అయితేనే అనుకో.. మా ఇంట్లో వాళ్ళ గురించి అసలు ఆందోళన అవసరం లేదు.. నాకు నచ్చే మనిషే వాళ్ళకీ కావాలని ఎప్పుడో చెప్పేశారు.. ఇప్పుడెళ్ళేది అమ్మమ్మని చూడటానికి.. వంట్లో కాస్తేదో బాలేదంట.. నన్ను చూడాలని గొడవ చేస్తోందని పండు చెప్పాడు.."

ఉన్నట్టుండి అమ్మమ్మా, ఆ పండెవరో నాక్కూడా చాలా ఆత్మీయులైపోయారు.. అలా నా పక్కనే కూర్చుని, ఒక్కొక్క తెరా తొలగిస్తూ తన మనసుని ఆవిష్కరిస్తుంటే నాకు చాలా హాయిగా ఉంది.. జోరువాన విన్యాసాలని కిటికీ లోనించి చూస్తూ సిగరెట్ తాగుతున్నప్పుడు కలిగే హాయి.. రోజుకి ఒకటీ రెండూ అయినా అవనీ అసలు నాకీ అలవాటుందని తెలిస్తే ఏం చేస్తుందో?! బాగా బతిమాలించుకుని గానీ మానకూడదు.. చిలిపితనం మెల్లగా రెక్కలు విప్పుకోవడం తెలుస్తోంది.. ఆ మోము మీద నర్తిస్తున్న ముంగురులను సున్నితంగా చెవి వెనక్కి తోసినట్లే తోసి, చక్కిలిగింతలు పెట్టేసి...

"నిన్ను ఇబ్బంది పెట్టడం లేదు కదా?" అటూ ఇటూ కాదు నా వంకే సూటిగా చూస్తూ అడిగింది..

"ఛ.. ఛ.. అదేం లేదు" ఇంతకంటే ఎక్కువ మాట్లాడాలన్నా, తన వంక చూడాలన్నా అప్పటికే కట్టు తెంచేసుకున్న ఇష్టం ఎక్కడ వరదలా పొంగి తనని ముంచెత్తుతుందోనన్న భయం!

ఈ దేశ ప్రయాణ సంస్థ ఉన్నటుండి అతి సమర్థవంతంగా పని చేయడం మొదలుపెట్టేసినట్లుంది!! తనని తీసుకెళ్ళే రైలు సరిగ్గా టైముకే రొప్పుకుంటూ వచ్చి ఎదురుగా నిలబడి ఆయాసం తీర్చుకుంటోంది..

"నీ నిర్ణయం నేను రాగానే చెప్పాలనేం లేదు.. నీక్కావాల్సినంత సమయం తీసుకో...." సీట్లో సర్దుకోగానే బయటకి చూస్తూ చెప్పింది..

"పద్దెనిమిది గంటల జర్నీ అంటున్నావ్.. ఫ్లైట్లో వెళ్ళడానికి కుదరదా?"

ఇప్పుడెళ్ళి సాయంకాలానికల్లా తిరిగొచ్చేయకూడదూ అన్న నా విజ్ఞప్తికి కి మాటల్లోస్తే వేసిన ప్రశ్న అది!

"మన దేశంలోని అన్ని ఊళ్ళల్లోకీ విమానాలు దూసుకెళ్ళే రోజు ఇంకా రాలేదనుకుంటా?"

బుద్ధిగా చెప్తున్నట్లనిపించినా కళ్ళల్లో నవ్వు చిందులేయడం తెలుస్తూనే ఉంది!

ఇంకా ఏవేవో అంటూనే ఉంది.. కానీ అప్పటివరకూ పక్కనే ఉన్న తన చిరుస్పర్శల ఉనికికీ నాకూ మధ్య ప్రత్యక్షమైన ఇనుప కిటికీని చూడగానే అమాంతంగా దిగులు చుట్టుముట్టింది.. "వెళ్ళక తప్పదా??" నా గొంతులోని జీర తనకేదో రహస్యం చెప్పింది కాబోలు కళ్ళు కాస్త విచ్చుకున్నాయి.. కిటికీ ఊచల్ని పట్టుకున్న నా చేతిమీద తన చెయ్యి బిగుసుకుంది..

"ఐ లవ్యూ రిషీ" స్థిరంగా కళ్ళల్లోకే చూస్తూ చెప్పింది..

"మీ అమ్మమ్మగారిని అడిగానని చెప్పు" చేతులు వదలాలనిపించక.. రైలు వేగంతో పోటీ పడలేక వగరుస్తూ చెప్పాను.. ఇద్దరి మధ్యా దూరం నెమ్మదిగా పెరుగుతూనే ఉన్నా కిటికీలోంచి ఇంకా తన మొహం, ఊపుతున్న చేతులు కనబడుతూనే ఉన్నాయి..

"ఆ రైలు దొంగిలించుకెళ్తున్న కనకాంబరాల పూలపొట్లం నాదే!" అని ప్లాట్ఫాం అంతా వినిపించేలా ఒక్కసారి గట్టిగా అరిచి చెప్పాలనిపించింది!

ఆఖరి పెట్టె కూడా కనుచూపుమేర నించి అదృశ్యమైపోయినా ఏదో అత్యాశ.. ఇంకొన్ని క్షణాల్లో పట్టాల పక్కనున్న గడ్డిపూలు కోసుకుంటూ కనిపించే మలుపులోంచి తను నడిచి రావడం కనిపిస్తుందని! అవును, నేను ఇక్కడే వేచిఉంటానని తెలిసి ఏ క్షణాన్నైనా తను వచ్చేస్తుంది.. ఇందాకటివరకూ మాకాశ్రయమిచ్చిన బెంచీ మౌనంగానే నన్నాహ్వానించింది.. అప్పటిదాకా ఉన్న రంగుల వసంతాన్ని పంపేసి చుట్టూ శిశిరం సర్దుకుంది! ఋతువులు వెనక్కి నడవడంలేదుకదా!

'ఇద్దరం కోరుకునేది ఒక్కటే!' ఈ విషయం నాకొక్కడికే తెలుసన్న సంగతి చాలా ఎక్సైటింగ్ గా అనిపించింది.. తనక్కూడా చెప్పేస్తే సంతోషంగా వెళ్ళొచ్చేదేమో.. అసలు 'ఐ లవ్యూ' చెప్పినమ్మాయికి 'అమ్మమ్మని అడిగానని చెప్పు ' అని సమాధానం చెప్పింది ఈ ప్రపంచంలో నేనొక్కడినే అనుకుంటా!!

ఏదీ, మనసు ఆ ఆనందం తాలూకు అచేతనస్థితిని ఇంకా దాటనేలేదు.. తన మాటలు ఇంకా చెవిలో వినిపిస్తూనే ఉన్నాయి.. 'రేపొద్దున్న నన్ను రైల్వే స్టేషన్లో దింపడానికి రాగలవా?' అని నిన్న ల్యాబ్ లో అడిగినప్పుడు 'నేను దింపడమేమిటీ' అని అయోమయంలో పడ్డ నన్ను చూసి తను నవ్వు దాచుకోవడం గుర్తొచ్చింది.. ఆ నవ్వు ఇప్పుడు నా పెదాల వరకూ పాకింది.. 'రానీ చెప్తాను.. సర్ ప్రైస్ లు చేయడం తనకే

కాదు నాకూ తెలుసు.. వచ్చీ రాగానే.... అవునూ, అసలెప్పుడొస్తోంది?? ఇందాక చెప్పిందా? రెండు రోజులందా లేక మూడు రోజులా? ఇవాళతో కలిపేగా చెప్పింది?!?!

హఠాత్తుగా ఇందాకటి ఎక్సైట్ మెంట్ మాయమై దిగులు మబ్బు కమ్ముకుంది.. ముందుకు వంగి ఆ రైలెళ్ళిన వైపు మళ్ళీ చూశాను.. చైన్ లాగేసి మౌనరాగంలోలా రెండు చేతుల్తో నిన్ను ఎత్తుకుని దింపడానికి నేను ఆ ట్రైన్ ఆఖరి పెట్టెలోనైనా ఎక్కి ఉండాల్సింది!

"యె జాతే హుయె లమ్హో.. జర ఠెహరో.. మైన్ భీ తో చల్తా హూ.. జర ఉన్ సే మిల్తా హూ".. బోర్డర్ పాట అప్రయత్నంగా గుర్తొచ్చింది.. తల భారంగా అనిపించి వెనక్కి వాల్చి కళ్ళు మూసుకున్నాను.

*******

"కృపయా ధ్యాన్ కీజియే.. నయి దిల్లీ సే ఆనేవాలీ.. ..." అనౌన్సర్ గొంతు ఖంగున మోగగానే ఉలిక్కిపడి చుట్టూ చూశాను..

చుట్టూ తీరిగ్గా కబుర్లు చెప్పుకుంటున్న ప్రపంచంలో కలకలం మొదలైంది.. పిల్లల్ని ఒడిసి పట్టుకుని, లగేజీ దగ్గరకు లాక్కుని యుద్ధానికి వెళ్ళబోయే సైనికుల్లా అందరూ తయారవుతున్నారు..

ఎనిమిది సంవత్సరాలా ఐదు నెలల పదిహేడు రోజుల క్రితం నాటి జ్ఞాపకాలు మళ్ళీ ఫ్రెష్ గా పంప్ చేసిన బాధ సుళ్ళు తిరుగుతోంటే లేచి నిలబడ్డాను.. సరిగ్గా ఉండే కాలు కూడా వణికి, అడుగు తడబడితే సర్దుకోడానికి పక్కనే ఉన్న స్థంభాన్ని పట్టుకున్నాను..

పట్టాల్ని మింగేస్తూ వస్తున్న రైల్లోంచి చెయ్యూపుతున్న నీరజ కనిపించింది.. నా రీసెర్చ్ స్పాన్సర్ చేసిన బయోటెక్ ఫర్మ్ తో త్వరలో మొదలుబెట్టబోయే డ్రగ్ ప్రొడక్షన్ కి సంబంధించిన లావాదేవీల కోసం వెళ్ళి తిరిగొస్తోంది..

"Looks like you have done it!, my dear!" లగేజ్ అందుకుంటూ అన్నాను..

"మరి డీల్ చేసింది ఎవరు? Your wife, the business pro!" ఇంకో చేతిని తన చేతిలో పొదువుకుని ముందుకు నడిచింది..

"ఎన్నిసార్లు చెప్పాను నీరూ, రైల్లో జర్నీ ఎవాయిడ్ చేయమని!" డ్రైవర్ కారు రివర్స్ చేస్తుంటే కాస్త కోపంగానే అన్నాను..

"నాకు తెలీదే అన్ని ఊళ్ళల్లోకి విమానాలు దూసుకెళ్ళేంతగా మన దేశం ఎదిగిపోయిందని! ముఖ్యంగా నీ ల్యాబ్ కడుతున్న ఊర్లోకి!!" మీదకి కొంచెం ఒరిగి నుదిటి మీద చిన్నగా ముద్దు పెట్టుకుంటూ నవ్వింది..

సరిగ్గా ఇలాంటి నవ్వే కదూ అప్పుడు కూడా! 'ఆ' నవ్వు.... తన కళ్ళు దాచిపెట్టాలని ప్రయత్నించిన 'ఆ' నవ్వు మళ్ళీ గుండెని రాసుకుంటూ దూసుకెళ్ళింది!

"నీ శ్రమకి తగ్గ ఫలితం త్వరలో చూడొచ్చు రిషీ.. రాబోయే తరంలో లుకేమియా లాంటి క్యాన్సర్ వచ్చినా.. ముఖ్యంగా ముక్కుపచ్చలారని చిన్నారుల్లో లైఫ్ టైం ట్రిమెండస్ గా పెరుగుతుంది!" నీరజ అలసటగా వెనక్కి వాలుతూ అంది.

ఇదే కదూ తన తాపత్రయం కూడా.. 'రోగాలుండని రాబోయే తరం'!!

కానీ అసలు మందులు కనుక్కోవాల్సింది ఇవాళ్టి తరం మానసిక రుగ్మతలకన్న విషయం తెలీనేలేదు! చాలా ఆలశ్యం చేశేశాం...

మేం పుట్టినప్పుడే రీసెర్చ్ మొదలుపెట్టి ఉండాల్సింది!! మానవత్వం బలంగా పెరగడానికి మందులు కనిపెట్టి ఉండాల్సింది.. మధ్యలో పనిచేయడం ఆగిపోయినా వెంటనే ట్రాన్స్ ప్లాంట్ చేయగలిగే పరిజ్ఞానం సంపాదించి ఉండాల్సింది..

అసలప్పుడీ హింసా వాదాలుండేవి కావు! నా ప్రాంతం కాదు, నా దేశం కాదు, నా భాష కాదని మనుషులు ద్వేషంతో రగిలిపోయేవాళ్ళు కారు! ఆ ద్వేషంతోనే.. మనుషుల ప్రాణాలు తీయడానికి తప్ప మరెందుకూ పనికిరాని ద్వేషంతోనే రాత్రిపూట అకస్మాత్తుగా రైళ్ళాపి... పాశవికంగా నిప్పంటించి... ఎంతోమంది అమాయకుల ప్రాణాలు... అమ్మమ్మకి బాలేదని వెళ్తున్న తన ప్రాణాలు.. తర్వాతి తరాలకి లోపాల్లేని జీన్స్ ఇవ్వాలని ఆశపడ్డ నా 'తన ' ప్రాణాలు తీసేవాళ్ళు కారు!!

"...మై భీ తో చల్తా హూ.. జర ఉన్ సే మిల్తా హు....." ఆరోజు ఆఖరి పెట్టెలోనైనా ఎక్కనందుకు అనుక్షణం నిందించిన మనసుకి తర్వాత నీరజే ఏదో సర్ది చెప్పింది.. ఎప్పుడో చేయలేకపోయిన పని గురించి కాదు ఇప్పుడు చేయాల్సిన పని గురించి ఆలోచించమంది! అందుకే ఇంకా ఆలశ్యం చేయదల్చుకోలేదు!

అందుకే నీరజ 'ల్యాబ్ ' అని ముద్దుగా పిలిచే నా శాంతివనం స్కూల్లో పిల్లలపై మొదటి ప్రయోగం చేయబోతున్నాను.. బ్లడ్ సెల్స్ మీద పరిశోధనలతో పాటు మానవత్వం ఉన్న మనిషిగా ఎదగడానికి అవసరమైన పాఠ్యాంశాల మాత్రల్ని కూడా సిద్ధం చేస్తున్నాను.. వాటిని ఆ పిల్లలతో మింగించి తను ఆశపడ్డ ఏ రోగాలూ ఉండని జీన్స్ ని తర్వాతి తరాలకి అందించడానికి మొదటిప్రయత్నం చేస్తున్నాను!

*******